క్లుప్తంగా

సత్తాచాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

పాతపట్నం: రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీలకు గంగువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు 9 మంది ఎంపికై సత్తాచాటారని పాఠశాల హెచ్ఎం ఆర్.ఆర్. వల్లభరావు శుక్రవారం తెలియజేశారు. రాష్ట్రస్థాయిలో సాఫ్ట్ టెన్నిస్ అండర్-17 బాలుర విభాగంలో సీహెచ్ జగదీష్, స్వీష్ అండర్-17 బాలుర విభాగంలో జె.వీరేంద్ర, అండర్-14 బాలుర విభాగంలో కె.మోహిత్‌లు, జిల్లాస్థాయిలో చెస్ అండర్ -14 బాలికల విభాగంలో జె లిఖిత, జె.సంజనశ్రీ, సీహెచ్ సిరి, బాలుర విభాగంలో సీహెచ్ వంశీ కృష్ణ, అండర్-17 బాలికల విభాగంలో ఎ.శివజ్యోతి, బాలుర విభాగంలో బి.వేణు సాయిలు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి



సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: భూ రిజిస్ట్రేషన్లకు సంబంధించి సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని దస్తావేజు లేఖర్లు డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు డాక్యుమెంట్ రైటర్ల సంఘం ఆధ్వర్యంలో ఆమదాలవలసలో శుక్రవారం పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్ కార్డుప్రైమ్ విధానంలో ఎడిట్ ఆప్షన్ లేకపోవడం వలన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ ఆర్.నారాయణమూర్తికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాజు, బొడ్డేపల్లి శ్రీనివాసులు, తిరుపతి పట్నాయక్, చింతాడ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

పాతపట్నం: మండలంలోని అంతరాబ కూడలి వద్దనున్న బీజేపీ కార్యాలయంలో శ్రీకాకుళం విజయశ్రీ బ్లడ్ బ్యాంకు, పడాల షణ్ముఖరావు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. 90 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో మంది ప్రాణాలు కాపాడుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అట్టాడ రవిబాబ్జి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ మధుసూదనరావు తదితరులు

పాతపట్నం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎస్.మధుసూదనరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగం, వాటి దుష్ప్రభావాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈగల్ సెల్ కమిటీ మెంబర్లను నియమించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కె.శ్రీరామమూర్తి, ప్రిన్సిపాల్ టి.హేమసుందర్, కె.ఉదయ్ కుమార్, కె.రవికుమార్, ఎస్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నినాదాలు చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.సురేష్ బాబు కోరారు. నరసన్నపేట ఏరియా ఆస్పత్రిలో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులు శుక్రవారం ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరి సమస్యలు పరిష్కారం కోసం చిత్తశుద్ధితో ఫెడరేషన్ కృషి చేస్తుందన్నారు. కాంట్రాక్టర్లు చేస్తున్న దోపిడీని అధికారులు అడ్డుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జీజీహెచ్ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మామిడి సూర్యనారాయణ, కార్యదర్శి జేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో ఎద.. గుర్తించకపోతే వ్యథ..!

- ఎద తప్పితే పునరుత్పత్తి తగ్గుదల
- నిరంతరం అప్రమత్తంగా ఉండాలి
- ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకుడు కరుణాకరరావు



కొరసవాడలో ఎదకు వచ్చిన ఆవును పరిశీలిస్తున్న పశు వైద్యుడు అనిల్ కుమార్



డాక్టర్ కరుణాకరరావు

పాతపట్నం: ఆడ పశువులు యుక్త వయస్సుకు వచ్చిన తర్వాత అండాశయంలో ఉత్పత్తి అయిన హార్మోన్ల ప్రభావంతో ఎద లక్షణాలను వ్యక్తం చేస్తాయి. వీటిని గుర్తించి సకాలంలో కృత్రిమ గర్భధారణ చేయించడం పునరుత్పత్తి యజమాన్యంలో అత్యంత కీలకం. చాలా మంది పాడి రైతులు ఎదను సరిగా గుర్తించలేక నష్టపోతున్నారు. ఒక ఎద తప్పినా వాటి పునరుత్పత్తి జీవిత కాలంలో నెల తగ్గిపోతుంది. నష్టం విలువ వెయ్యి నుంచి పదిహేను వందల వరకు ఉంటుంది. అందుకే పశువుల ఎద కాలాన్ని సూచించే లక్షణాలను ప్రతి పాడి రైతు తెలుసుకుని ఉండాలి. ఈ లక్షణాలను ఎలా గుర్తించవచ్చో ప్రాంతీయ పశు సహాయ సంచాలకుడు డాక్టర్ మంచు కరుణాకరరావు సూచిస్తున్నారు.

మూగ ఎద

ఎద లక్షణాలు కనిపించకుండా ఉండిపోవడమే మూగ ఎద అంటారు. ఇది గుర్తించడం కష్టమే. కానీ జాగ్రత్తగా గమనిస్తూ ఉంటే సులువుగానే కనిపెట్టొచ్చు. గేదెలు 50 శాతం మూగ ఎదలోనే ఉంటాయి. ఆ సమయంలో అవి కీచుగా అరుస్తాయి. దగ్గరనున్న పశువులను, మనుషులను బెదురుగా చూస్తాయి. గేదెల మార్చి నుంచి ఆగస్టు నెలల్లో ఎదకు వస్తాయి. ఈ మధ్యకాలంలో మూగ ఎద లక్షణాలను గుర్తించానికి రోజుకు పది నిమషాలు గేదెల ప్రవర్తనను గమనించాలి. ఎండాకాలంలో ఎద లక్షణాలు అన్నీ కనిపించవు. సరైన పోషణ లేని గేదెల్లో అసలు ఆ లక్షణాలే కనిపించవు. సుమారు 50 శాతం గేదెల్లో పునరుత్పత్తి సమస్యలు ఎద లక్షణాలను గుర్తించకపోవడంతోనే కలుగుతాయి. పాడి పశువుల్లో వచ్చే ఎదను జాగ్రత్తగా గమనించాలి. మూగ ఎదకు వచ్చే పాడి పశువుల్లో ఎదకాలం సాధారణం కన్నా ఎక్కువ కాలం ఉండొచ్చు. అవసరమైతే కృత్రిమ గర్భధారణ చేసిన 6 గంటలు తర్వాత మళ్లీ గర్భధారణ చేయించాలి. గేదెలు లేదా సంకరజాతి పశువుల్లో ఎదకు వచ్చిన 7, 10 రోజుల్లో మళ్లీ ఎదకు వస్తే గర్భధారణ చేయించాలి. పాడి పశువులు ప్రతీ 25 రోజులకు ఒకసారి ఎదకు వస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో 3 నుంచి 5 నెలల చూడి కాలంలో ఎదకు వస్తాయి. దీనినే చూడి ఎద అంటారు. ఆ సమయంలో వీటికి గర్భధారణ చేయించరాదు.

ఆవుల్లో ఎద లక్షణాలు

ఆవుల్లో ఎదకాలం 18 నుంచి 24 గంటలు ఉంటుంది. సాధారణంగా ఎదకాలాన్ని మూడు దశలుగా విభజించారు. ఎదకు వచ్చిన ఆవులు తొలిదశలో మంద నుంచి వేరుపడి చికాకుగా ఉంటాయి. ఆకలి మందగించడంతో మేత సరిగా తినవు. మధ్య దశలో ఇతర ఆవులతో కలిసి ఉన్నా చికాకుగానే ఉంటాయి. ఈ దశలో ఆకలి బాగా పడిపోతుంది. చివరి దశలో చికాకు తగ్గిపోతుంది. మేత మామూలుగానే ఉంటుంది. తొలిదశలో పాల ఉత్పత్తి తగ్గుతుంది. మధ్య దశలో పాలు బాగా తగ్గిపోతాయి. చివరి దశలో మాములు స్థితికి వచ్చేస్తాయి.

గేదెల్లో ఎద లక్షణాలు

తరచూ చిరుమూత్రం పోసే గేదెలు ఎదలో ఉన్నట్లు గుర్తించాలి. కొన్ని 5 నిమిషాలకు 4, 5 సార్లు మూత్ర విసర్జన చేస్తాయి. గేదెల్లో ఎద లక్షణాలు 24 నుంచి 36 గంటల పాటు ఉంటాయి. ఈ సమయంలో గేదె చికాకుగా ఉంటూ మేత తినడం మానేస్తుంది. మనం తెరిచి చూస్తే లోపలి పొర ఎర్రగా ఉంటుంది. పాడి గేదెలు ఎదకు వచ్చినప్పుడు పాలు తగ్గుతాయి.

సేంద్రియ వ్యవసాయాన్ని అలవర్చుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం రమేష్

సారవకోట: గిరిజనులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అలవర్చుకోవాలని నాబార్డు డీడీఎం రమేష్ సూచించారు. మండలంలోని గిరిజన గ్రామాలైన జగన్నాథపురం, రైవాడ గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో చేపడుతున్న జీవ అనే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవ కార్యక్రమం ద్వారా సేంద్రియ పద్ధతిలో వ్యవసాయంపై గిరిజన రైతులకు మరింత కల్పించాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఉన్న 50 గిరిజన కుటుంబాలకు సీతాఫలం, జామ, నిమ్మ, మునగ మొక్కలను పంపిణీ చేశారు. ఆయనతో పాటు బ్రెడ్స్ సంస్థ అధ్యక్షుడు సాంబమూర్తి తదితరులు ఉన్నారు.

పాఠశాలకు వితరణ



కుర్చీలు, గోడ గడియారాలను అందిస్తున్న దృశ్యం

హిరమండలం: మండలంలోని జగన్నాథపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కుర్చీలతో పాటు గడియారాలను దాతలు అందించారు. గ్రామానికి చెందిన ధర్మాన సోమేశ్వరరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రెండు కుర్చీలతో పాటు గోడ గడియారాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దాత కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పథంలో నడిపించాలి



అవగాహన కల్పిస్తున్న వెలుగు అసోసియేషన్ సభ్యులు

మెళియాపుట్టి: గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించడానికి సర్పంచ్‌లు కృషి చేయాలని వెలుగు అసోసియేషన్ ఏరియా కో-ఆర్డినేటర్ నాగరాజు అన్నారు. మండలంలోని ఇల్లాయిపురం గిరిజన గ్రామంలో గొట్టిపల్లి, కేరాసింగి, అంపురం, ఇల్లాయిపురం గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. గ్రామసభలు నిర్వహించి, తద్వారా సమస్యలు గుర్తించి పరిష్కార మార్గం చూపాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ దాసునాయుడు, కో-ఆర్డినేటర్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

థర్మల్ వ్యతిరేక సభను విజయవంతం చేయాలి

సరుబుజ్జిలి: బూర్జ మండలంలోని అడ్డూరుపేట వద్ద ఈనెల 22వ తేదీన తలపెట్టిన థర్మల్ వ్యతిరేక బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, పోరాట కమిటీ చైర్మన్ సురేష్‌దొర, కోశాధికారి అత్తులూరి రవికాంత్‌లు కోరారు.

ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడుతూ.. సరుబుజ్జిలి, బూర్జ మండలాల నడుమ ప్రతిపాదించిన థర్మల్ ప్లాంట్ మానవాళి మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తుందన్నారు. దీనిని అందరూ కలిసికట్టుగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. అన్ని పక్షాలతోపాటు, ప్రజలంతా భారీ ఎత్తున పాల్గొనాలని విన్నవించారు.

ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స అందించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రసన్నకుమార్

కొత్తూరు: గ్రామాల్లోని ఆర్ఎంపీలు ప్రథమ చికిత్సను మాత్రమే అందజేయాలని, స్థాయికి మించి వైద్యం అందిస్తే చర్యలు తప్పవని కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ప్రసన్న కుమార్ హెచ్చరించారు. స్థానిక ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో మండలంలోని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సదస్సు శుక్రవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. అర్హతకు మించి వైద్యం అందించడం వలన రోగులు అనర్థాలను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. రోగులపై అధికంగా యాంటీ బయాటిక్ మందులు వినియోగిస్తున్నారని, దీనివలన పలు సమస్యలు వస్తాయన్నారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న మందులు మాత్రమే వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

అక్షరాస్యత శాతం పెరగాలి



సారవకోట: మాట్లాడుతున్న ఎంఈవో రమణ

సరుబుజ్జిలి: గ్రామాల్లో అక్షరాస్యత శాతం పెరిగేలా వలంటీర్లు బాధ్యతగా పనిచేయాలని ఎంఈవో కె.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం సీహెచ్ గోవిందరాజులు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు శనివారం నిర్వహించిన శిక్షణా శిబిరంలో మాట్లాడారు. అక్షర జ్ఞానం లోపించడం వలన ప్రజలు అనేక రకాల మోసాలకు గురవుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా మారినపుడే సమాజం మరింత ప్రగతి బాటలో పయనిస్తుందని వెల్లడించారు. వెలుగు, ఎన్ఆర్ఈజీఎస్ శ్రామికుల నుంచి ఎంపిక చేసిన 260 మంది వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రామారావు, ఏవో ప్రసాదు, ఉల్లాస్ కో-ఆర్డినేటర్ రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని 3,500 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యత వలంటీర్లకు ఉందని ఎంపీడీవో నీరజ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉల్లాస్ కార్యక్రమంపై వలంటీర్లకు రెండు రోజులు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నిరక్షరాస్యత రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తులసీవరప్రసాదరావు, ఏపీఎం లలిత, ఏపీవో ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

హిరమండలం: వయోజనులకు విద్యను అందించే బాధ్యత వలంటీర్లదేనని ఎల్ఎన్‌పేట ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వయోజనులకు విద్యను అందించేందుకు వలంటీర్లను ఎంపిక చేశారు. 1,500 మంది వయోజనులను అక్షరాస్యులుగా మార్చేందుకు 156 మంది వలంటీర్లను ఎంపిక చేశారు. వారికి ప్రత్యేకంగా శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో మణికుమార్, రిసోర్స్ పర్సన్లు అమ్మినాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

సారవకోట: వయోజనులను అక్షరాస్యులుగా మార్చేందుకు కృషి చేయాలని ఎంఈవో ఎంవీ రమణ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉల్లాస్, అక్షర ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2,600 మంది ఉపాధి హామీ వేతనదారులు, స్వయం శక్తి సంఘాల సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు 260 మంది వలంటీర్లను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో- 2 భూలక్ష్మి, ఏపీవో నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: మాట్లాడుతున్న ఎంపీడీవో నీరజ



హిరమండలం: మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు



సరుబుజ్జిలి: మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు

మురుగు నీరు తొలగింపు

సారవకోట: మండలంలోని తర్లి ఆశ్రమ పాఠశాల ఆవరణను శుక్రవారం బాగు చేశారు. రెండ్రోజుల క్రితం సాక్షి పత్రికలో పాఠశాల ఆవరణలో మురుగు నీరు అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పాఠశాల సిబ్బంది స్థానిక నాయకుడు ధర్మాన తేజ్ కుమార్ దృష్టికి సమస్య తీసుకెళ్లారు. ఆయన తన సొంత నిధులు వెచ్చించి పాఠశాల ఆవరణను మట్టితో ఎత్తు చేశారు. అలాగే పాఠశాల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, కొండ ప్రాంతం నుంచి వర్షపు నీరు ఆవరణలోకి చేరకుండా తగిన చర్యలు తీసుకున్నారు.



పాఠశాల ఆవరణలో పనులు చేపడుతున్న దృశ్యం

గణిత దీప్తి విద్యార్థులకు ఉపయుక్తం



గణిత దీప్తి స్టడీ మెటీరియల్ విడుదల చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: గణిత దీప్తి పదో తరగతి విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కేపీ రాములు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ మ్యాథమెటిక్స్ ఫోరం రూపొందించిన పదో తరగతి మ్యాథమెటిక్స్ స్టడీ మెటీరియల్ గణిత దీప్తిని శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత దీప్తి స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు ఉపయోగించుకొని, పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నతంగా నిలవాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులు షేక్ షావలి, తాండ్ర చంద్ర మనోహర్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పైల రవికుమార్, స్టాఫ్ సెక్రటరీ పైడి రామస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ సరుబుజ్జిలి ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పైడి యోగీశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు, మరమ్మతులు చేపట్టనుండడం వలన నందికొండ, సరుబుజ్జిలి, వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయం ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పాతపట్నం: మండలంలోని రొంపివలస సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతుల పనులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టెక్కలి విద్యుత్ శాఖ ఈఈ నర్సింహకుమార్ శుక్రవారం తెలిపారు. ఆర్.ఎల్.పురం, రైతుపురం, అనంతగిరి, బైదలాపురం, పెద్ద సున్నాపురం, కొమ్మలగూడ, మామిడిపల్లి, నల్లకొత్తూరు, పూతికగూడ, బుర్జిగూడ, ఏఎస్ కవిటి, చాకిపల్లి, నల్లబొంతు, చిన్నకింగ, స్టువర్టుపేటతో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పక్కాగా చెత్త సంపద కేంద్రాల నిర్వహణ



చెత్త సంపద కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

హిరమండలం: గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పక్కాగా నిర్వహించాలని టెక్కలి డివిజన్ అభివృద్ధి అధికారి అలివేలు మంగమ్మ అన్నారు. మండల కేంద్రంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఇంటింటా చెత్త సేకరణ గురించి అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. సచివాలయాల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో హాజరు జాగ్రత్తగా వేయాలని సూచించారు. ఆలస్యంగా విధులకు హాజరైతే జీతంలో కోత విధించాలని స్పష్టం చేశారు. ఎంపీడీవో కాశీప్రసాదరావు, ఈవో భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. బాలికలను సంరక్షించాలి అనే అంశంపై పోటీలు నిర్వహించారు. 35 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలను ఎంపిక చేసి హెచ్ఎం కేశవరావు చేతులమీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిహారం ఇప్పించండి

హిరమండలం: వంశధార నది వరద నీటిలో మునిగిపోయిన 40 ఎకరాల భూములకు సంబంధించి పరిహారం ఇప్పించాలని గొట్టా, గొడియాపాడు గ్రామస్తులు కోరుతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం గొట్టా బ్యారేజీని నిర్మించిన సంగతి తెలిసిందే. అయితే వరదలు వచ్చిన ప్రతిసారీ నదిలో నీటి నిల్వలు పెరిగి గొట్టా, గొడియాపాడులోని పంట భూములు ముంపునకు గురవుతున్నాయి. కనీసం రక్షణ గోడ లేకపోడంతో ఈ రెండు గ్రామాల పరిధిలో 40 ఎకరాల భూములు ముంపుబారిన పడుతుంటాయి. ఈ ఏడాది కూడా నదిలో నీరు పెరిగిపోవడంతో పొలాలు పూర్తిగా మునిగిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముంపు పొలాలను జెడ్పీటీసీ సభ్యుడు పాగిరి బుచ్చిబాబు శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పారు.

పొంచివున్న ప్రమాదం



ఈ ఫొటోలో వాలిపోయి కనిపిస్తున్న విద్యుత్ స్తంభాలు బాణాపురం పంచాయతీ బగడ, బాలేరు నుంచి జాడుపల్లి వెళ్లే రహదారిలో దర్శనమిస్తున్నాయి. పచ్చగా ఉన్న పంట పొలాల్లోకి వాలిపోయి ప్రమాదకరంగా మారాయి. రైతులు నిత్యం పొలం పనులు చేసుకుంటూ అక్కడే ఉంటారు. దీంతో ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత అని ప్రశ్నిస్తున్నారు. ఆయా గ్రామాల రైతులు పంట పొలాలకు వెళ్లే సమయంలో భయం గుప్పిట్లో బతుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభలను సరి చేయాలని కోరుతున్నారు.

\- మెళియాపుట్టి

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మెళియాపుట్టి: మండలంలోని పట్టుపురం గ్రామంలో విశ్వకర్మ మండపం వద్ద మహిళలు కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ ఆది గురువు, ఆరాధ్య దైవం విశ్వకర్మకు ఘనంగా పూజలు నిర్వహించడం జరుగుతోందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

హిరమండలం: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో మండల వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంఎన్ఎన్‌వీఎస్ ఉమా శంకర్, ఉపాధ్యక్షుడిగా విజయభాస్కర్ పట్నాయక్, కార్యదర్శిగా సింహాద్రి, సంయుక్త కార్యదర్శిగా రాజబాబు, కోశాధికారిగా సింహాచలంను నియమించారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.